జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 16 | నవంబర్ | 2026 • పేజీలు : 6

- భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్

కార్తీక మాసంలో గోదావరి నదీ హారతి విశేష ఫలప్రదం



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): శివకేశవులకు అత్యంత ప్రీతి పాత్రమైన కార్తీక మాసంలో గోదావరి నదికి హారతులు సమర్పించడం విశేష ఫలప్రదమని భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ అన్నారు. కార్తీక మాసంలో శివునికి అభిషేకాలు, శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజలు నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని పేర్కొన్నారు. కార్తీక ఆదివారం సందర్భంగా భద్రాచలం గోదావరి నదికి భద్రాద్రి ర్యంలో భక్తుల సహకారంతో బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వ

మిగతా 2 లో...

- ఎల్ నినో దెబ్బ.. ధరల భారం.. జనం విలవిల..!
- వ్యాపారాలు లేవు.. ఆన్ లైన్ దెబ్బకు చిన్న షాపులు ఖాళీ...
- పేదలకు బతుకు భారమవుతోంది..!
- పని జీతం పెరగట్లే.. ధరలు ఆగట్లే.. మధ్యత రగతి ఉక్కిరిబిక్కిరి...
- ఫోన్ లోనే బతుకు.. మనుషుల మధ్య దూరం పెరిగిపోతోంది...
- రైతు కన్నీరు.. వ్యాపారి ఆవేదన.. సామాన్యుడి కష్టం ఎవరికి కావాలి..?



2 లో..

సమాజం ఎటు పోతోంది..?

సమాజం ఎటు పోతోంది..? ఒకప్పుడు పండుగ వస్తే మార్కెట్ కళకళలాడేది. ఇప్పుడు పండుగ వచ్చినా షాపుల్లో మనుషులు లేరు. జేబులో డబ్బు లేదు. చేతిలో సరుకు లేదు. సామాన్యుడి బతుకు రోజురోజుకూ భారమవుతోంది. ఒకప్పుడు పక్కింటోడి కష్టం అంటే మన కష్టం అనుకునే మనుషులు ఉండేవారు. ఇప్పుడు ఎదురింటోడు ఏడుస్తున్నా పట్టించుకునే తీరిక లేదు. పలకరింపులు కరువయ్యాయి, ప్రేమలు మాయమయ్యాయి. మనిషి ఒంటరివాడైపోయాడు. డబ్బు కోసం పరుగెడుతూ మనిషి మనిషినే మరిచిపోతున్నాడు.

పాల్వంచ రాకసిమిట్టపై 1,500కు పైగా బృహత్ శిలాయుగ సమాధులను గుర్తించిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి



3 లో...

కాలుష్య కోరల్లో మణుగూరు..!



4 లో...

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..!

- 203 పెన్షన్లు.. 24 కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు.. ఎమ్మెల్యే పాయం
- కరకగూడెంలో సంక్షేమ పండుగ కార్యక్రమం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / కరకగూడెం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) : అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ఎన్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కరకగూడెం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు 203 చేయూత పెన్షన్లతో పాటు 24 కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత, నేత కార్మికులు,

మిగతా 2 లో...

కేటీపీఎస్ ఏడవ దశలో ఆర్టిజన్ కార్మికుడు మృతి



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 15,(ప్రజాజ్యోతి) కేటిపిఎస్ ఏడోదశ కర్మాగారంలో ఆర్టిజన్ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది , ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, పాల్వంచలోని వెంకటేశ్వరహిల్స్ కాలనీలో నివాసముంటు ఏడవదశ కర్మాగారంలో ఆర్టిజన్ గ్రేడు 2 గా విధులు నిర్వహిస్తున్న పెమ్మూల వెంకటేశ్వర్లు (50)రోజు మాదిరిగా విధులకు వెళ్లాడు,విధులకు వెళ్లిన వెంకటేశ్వర్లు మధ్యాహ్నం కేటీపీఎస్ 7వదశలోని కోల్ ప్లాంట్‌లో బి ఓ బి ఆర్ వ్యాగన్ల ద్వారా వచ్చిన బొగ్గు అన్‌లోడింగ్ పనుల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో తన సహోద్యోగికి ఎయిర్ పైప్ అందించి, మరో వ్యాగన్ వైపు ప్లాట్‌ఫామ్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి ప్లాట్‌ఫామ్ గ్రిల్, వ్యాగన్ బాక్స్ మధ్య వెంకటేశ్వర్లు ఇరుక్కు పోయారు, ఈ ప్రమాదంలో ఆయన కుడి చేయి, తుంటి భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడే ఉన్నసహోద్యోగులు కాకరాలసుబ్బారావు,గడ్డం సత్యనారాయణ, బోడ రాములు కలిసి ఆయనను బయటకు తీసి కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు, మృతునికి భార్య పేమ్మూల రమణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు . ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బిర్సా ముండాకు ఘన నివాళులు

► ఘనంగా బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు



చర్ల, నవంబర్ 15(ప్రజాజ్యోతి): చర్ల మండలంలోని పెద్దముడిసిలేరు గ్రామ పంచాయతీలో ఆదివారం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించి ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు.అనంతరం గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్ మాట్లాడుతూ 19వ శతాబ్దంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్, భూమి, భుక్తి హక్కుల కోసం భగవాన్ బిర్సా ముండా తిరుగులేని పోరాటం సాగించారని తెలిపారు. ఆదివాసీలను చైతన్యపరిచి ఉద్యమ బాటలో నడిపించిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి భవిష్యత్తు ఆదివాసీ తరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బీరబోయిన అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొండి లీలా ప్రసాద్, మండల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు, మండల ప్రధాన కార్యదర్శి కాయం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బీరబోయిన బాలకృష్ణ, దేశ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..!



(మొదటి పేజీ తరువాయి...)

బీడీ కార్మికులకు చేయూత పెన్షన్లను అందజేశారు. అదేవిధంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచేందుకు 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఆర్ఓ, హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో గోదావరి నదీ హారతి విశేష ఫలప్రదం

(మొదటి పేజీ తరువాయి...)

దివ్య హారతులు సమర్పించారు. గోదావరి మాతకు, శ్రీ సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రాయప్రోలు సత్యప్రసాద్ శర్మ, చంద్రశేఖర్ శర్మ, తేజశర్మ, వీహెచ్‌పీ తిరుపతిరావు, సీబీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రవికుమార్ శర్మ దంపతులు, పీవీఎస్ఎన్ రెడ్డి దంపతులు సమర్పించిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

సమాజం ఎటు పోతోంది..?

మణుగూరు క్రైమ్, నవంబర్ 15, (ప్రజాజ్యోతి): ఎల్ నినో దెబ్బతో రైతు కన్నీరు పెడుతున్నారు. వాతావరణం మారిపోయింది. ఎల్ నినో ప్రభావంతో ఎప్పుడు వాన రావాలో అప్పుడు రావడం లేదు. రావద్దన్నప్పుడు వచ్చి పంటను ముంచేస్తోంది. ఒకవైపు ఎండలు, మరోవైపు అకాల వర్షాలు. దీంతో రైతు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. పండిన పంటకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. రైతు కూలీగా మారుతున్నాడు.కూలీగా మారినసరే ఆపని కూడా పని దొరకడం లేదు. సమాజం ఈస్థితిలో ఉరుకులు, పరుగులు పెడుతోంది.

అధిక ధరలు.. జనం విలవిల...

ఒకప్పుడు వంద రూపాయలతో సంచి నిండా సరుకులు వచ్చేవి. ఇప్పుడు వెయ్యి రూపాయలు పెట్టినా సంచి సగం కూడా నిండడం లేదు. బియ్యం, నూనె, పప్పు, కూరగాయలు.. ఏది ముట్టుకున్నా ధరలు మండిపోతోంది. చేసిన పని జీతం పెరగడం లేదు. ధరలు మాత్రం ఆగడం లేదు. మధ్యతరగతి కుటుంబం నెలాఖరు వచ్చేసరికి అప్పు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.పిల్లలఫీజులు,ఇంటిఅద్దె,కరెంటు బిల్లు, మందుల ఖర్చు.. అన్నీ కలిపి సామాన్యుడి నిద్రను దూరం చేసి అనారోగ్యాన్ని దగ్గర చేస్తున్నాయి..

వ్యాపారాలు లేక వ్యాపారస్తుల అవస్థ...

మణుగూరులో చిన్న వ్యాపారస్తుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఉదయం షాపు తెరిచిన దగ్గర నుంచి సాయంత్రం మూసే వరకు పది మంది కస్టమర్లు కూడా రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.షాపు అద్దె,కరెంటు బిల్లు,పనోడి జీతం కూడా రావడం లేదంటున్నారు. అప్పు తెచ్చి వ్యాపారం చేసినోడు అప్పు తీర్చలేక సతమతమవుతున్నాడు.వ్యాపారం నడవక అప్పుల ఉబిలో కురుకుపోతున్నారు.

ఆన్ లైన్ దెబ్బ...

ఇక చిన్న వ్యాపారాలకు పెద్ద దెబ్బ ఆన్ లైన్ బిజినెస్. ఫోన్లో ఒక క్లిక్ కొడితే చాలు సరుకు ఇంటికే వస్తోంది. డిస్కౌంట్, ఆఫర్లు అంటూ ఆన్ లైన్ కంపెనీలు జనాన్ని లాగేసుకుంటున్నాయి. దీంతో వీధి చివరన ఉన్న కిరాణా షాపు, బట్టల షాపు, ఎలక్ట్రానిక్ షాపు అన్నీ ఖాళీగా ఉంటున్నాయి. ఆన్ లైన్ లో కొనే జనానికి ఆ చిన్న షాపోడి కుటుంబం ఎలా బతుకుతుందో తెలియడం లేదు. టెక్నాలజీ పెరిగింది కానీ, మానవత్వం తగ్గిపోయింది. ఇలా ఉంటే మనిషి మనుగడ అర్థం స్థితిలో ఉండిపోతుంది.

సమాజం ఎటు..?

డబ్బు ఉన్నోడికి ఏ లోటూ లేదు. లేనోడికి తినడానికి తిండి కూడా లేదు. మధ్యతరగతి వాడు ఉన్నానో లేనో అన్నట్లు బతుకుతున్నాడు. ఒకరినొకరు పలకరించే తీరిక లేదు. అంతా ఫోన్లలోనే బతుకుతున్నారు. పండుగలు వస్తున్నాయి కానీ, మనసులో సంతోషం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ధరలు అదుపు చేయాలని, చిన్న వ్యాపారులను ఆదుకోవాలని, రైతుకు అండగా నిలబడాలని, లేకపోతే ఈ సమాజం మరింతగా కుంగిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ చైతన్య స్కూల్ ఫీజుల దోపిడి పై అడ్డుకట్ట వేసే నాధుడే లేడా!





- డిఇఓ కి ఫిర్యాదు చేసిన స్పందన కరువు
- జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన పట్టింపు లేదు
- జాతీయ ఎస్టీ కమిషన్ కి ఫిర్యాదు చేసిన స్పందించని జిల్లా యంత్రాంగం
- జాతీయ ఎస్టీ కమిషన్ తోటి సమన్లు జారీ చేసే ఆలోచనలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్

లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 15 , ప్రజాజ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండలం లోని ప్రశాంత్ నగర్ కాలనీలో శ్రీ చైతన్య స్కూల్ దోపిడీకి అడ్డుకట్ట వేసే నాధుడు లేడా! శ్రీ చైతన్య స్కూల్ దౌర్జన్యం దోపిడీ ధోరణికి ప్రశ్నించే గొంతు గొంతుక లేదా! జాతీయ ఎస్టీ కమిషన్ నుంచి నోటీసులు వచ్చిన జిల్లా యంత్రాంగానికి కొంచెం కూడా కదలిక లేదా ? శ్రీ చైతన్య స్కూల్లో కనీస ప్రమాణాలు పాటించని తీరుపై కూడా చర్చ లేదా! అర్హత లేని టీచర్ల నిర్వాహకానికి కారకులు ఎవరు ?మండల విద్యాశాఖ అధికారి నిద్రమత్తులో ఉన్నారా లేక ముడుపులు తీసుకొని పట్టించుకోకుండా గాలికి వదిలేసారా? ఈ స్కూల్ వెనుక అంతర్యం ఏమిటి ?. స్కూల్ అవినీతికి అక్రమాలకు అండగా ఉన్నలీడర్ ఎవరు? అనే సందేహాలు భద్రాద్రి జిల్లాలో కలవరం రేగుతుంది స్కూల్ ప్రారంభం నుంచి అడ్మిషన్ ఫీజు అనే పేరు తోటి వసూలు ,ఐడి కార్డు పేరుతోటి వసూలు, యూనిఫామ్ పేరు తోటి వసూలు ,బుక్స్ మెటీరియల్ అనే పేరు తోటి వసులు, ఎగ్జామ్స్ ఫీజు పేరు తోటి వసూలు ,కల్చర్ ఆక్టివిటీస్ పేరు తోటి వసూలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని స్కూళ్ల కంటే అధిక ఫీజులు మరియు అనేక పేరు మీద అనవసరపు ఫీజులు వేయించి ఏజెన్సీ లోని అమాయక గిరిజనులను అధికారులను తొత్తులుగా చేసుకుని రాజకీయ అండదండలతో గిరిజనులను ఫీజులు పేరట దోపిడీ చేస్తున్నారు అని సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్ మండిపడ్డారు.

గతంలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసిన ఈ స్కూలు పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు అదేవిధంగా ప్రజాదర్బార్లో కలెక్టర్కు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన రాలేదు చివరికి జాతీయ ఎస్టీ కమిషన్ కి ఫిర్యాదు చేసి జిల్లా యంత్రాంగానికి నోటీసులు వచ్చిన ఎటువంటి సమాధానం ఇవ్వకుండా ఎటువంటి పట్టింపు లేకుండా గాలికి వదిలేయడం వెనక ఎవరి హస్తవుంది ,దీని వెనక అంతరం ఏమిటి అనేది త్వరలోనే తెలుస్తానని వదిలిపెట్టే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు .

జాతీయ ఎస్టీ కమిషన్ హుస్సేన్ నాయక్ తోటి చరవాణి ద్వారా ఈ విషయాన్ని మరల గుర్తు చేసి చెప్పిన వెంటనే జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ స్పందించి 338A ఆర్టికల్ ద్వారా జిల్లా కలెక్టర్కు ,జిల్లా విద్యాశాఖ అధికారిని సమన్లు జారీ చేసే సివిల్ అధికారాలను జాతీయ ఎస్టీ కమిషన్ ఉపయోగించి ఢిల్లీకి పిలిపించి చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. ఈ లోపు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందా! ఈ స్కూలుపై లేదా వేచి చూడాల్సిందేనని తెలిపారు.

ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు భూక్య స్వాతి ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి

లక్ష్మీదేవి పల్లి ,నవంబర్ 15 ,ప్రజాజ్యోతి: బ్రిటిష్ వలస పాలనకు భూ కబ్జాదారులకు మత మార్పిడులకు వ్యతిరేకంగా "ఉలుగులాన్ "అనే గిరిజన ఉద్యమం పేరిట పోరాడిన గిరిజన ఉద్యమ నాయకుడు బిర్షముండా అని భద్రాద్రి కొత్తగూడెం ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షురాలు ముఖ్య స్వాతి తెలిపారు ప్రతి ఏటా నవంబర్ 15 తేదీన అతని జననం ను జన జాతీయ గౌరవ దివస్ గా జరుపుకుంటారు ఆయన గిరిజనుల పట్ల చేసిన త్యాగాలకు గాను ఉద్యమాలకు గాను గుర్తింపుగా పార్లమెంటు మ్యూజియంలో ఆయన చిత్రపటం ఉంచడం మనందరం గర్వించదగ్గ విషయమని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనను గిరిజనులు గౌరవంగా భగవాన్ అని మరియు ధర్తీ ఆబా అని పిలుచుకుంటారు. బిర్సముండా 1875 నవంబర్ 15 బెంగాల్ ప్రెసిడెంట్ ప్రస్తుత జార్ఖండ్ రాష్ట్రం ఉల్లి హోర్టు గ్రామంలో ఒక పేద ముండ గిరిజన



కుటుంబంలో సుగుణ ముండ – కాల్ మీ హత్తు దంపతులకు జన్మనిచ్చా రూ. ఆయన జననం రోజున గిరిజనుల పట్ల ఆయన చేసిన త్యాగాలకు గాను ఉద్యమాలకు గాను వారిని స్మరించుకుంటూ ఎస్టి మోర్చా ఆధ్వర్యంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలు ముఖ్య స్వాతి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మొగలి రామకృష్ణ బిజెపి లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు నవీన్ తదితరులు పాల్గొన్నారు

శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థికి జాతీయ గుర్తింపు..!

- వాలీబాల్ లో జాతీయ స్థాయికి గోపిరామ్ ఎంపిక
- స్కూల్ కు ఇది మరో గర్వ కారణమైన విజయం
- ఎస్జీఎఫ్ఐ పోటీల్లో కొత్త మల్లేపల్లి కుర్రాడి సత్తా..!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి.నవంబర్ 15, (ప్రజాజ్యోతి): - మణుగూరు ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాడు శ్రీవిజ్ఞాన్ స్కూల్ విద్యార్థి గోపిరామ్. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ఐ క్రీడా పోటీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లాలో జరిగిన వాలీబాల్ ఫైనల్ పోటీలలో ఖమ్మం జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి నగోపిరామ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ఘనతతో మణుగూరు ప్రాంతానికి తెలంగాణ రాష్ట్ర స్థాయి లో గుర్తింపు రావడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకరస్పాండెంట్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ, కొత్తమల్లేపల్లి గ్రామానికి చెందిన గోపిరామ్ పాఠశాల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. విద్యార్థి తన ప్రతిభను మరింత మెరుగు పరుచుకొని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి తెలంగాణ రాష్ట్రానికి, మణుగూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. గోపిరామ్ కు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల పీఈటీ కృష్ణమూర్తి, ఇన్ చార్జిలు దుర్గాదేవి, రజిత, ధనలక్ష్మి , విజయ్ కుమార్, కొమరయ్య, ఉపాధ్యాయులు మరియు గోపిరామ్ సహచర విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

పాల్వంచ రాకసిమిట్టపై 1,500కు పైగా బృహత్ శిలాయుగ సమాధులను గుర్తించిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి

- అరుదైన స్త్రీ మానవాకృత శిల్పాల వెలుగులోకి
- పరిశోధనాత్మకంగా ప్రాధాన్యత సంతరించుకున్న పురావస్తు ప్రాంతం







కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 15, (ప్రజాజ్యోత) పాల్వంచ మండల పరిధిలో గల మామిడిగూడెం శివారులోని రాళ్లచేలక ప్రాంతంలో ఉన్న రాకసిమిట్ట గుట్ట పై బృహత్ శిలాయుగం నాటి సుమారు 1,500కు పైగా డాల్మెన్ డాల్మినాయిడ్ సిస్ట్ సమాధులను మట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, 'డిస్కవరీ మ్యాన్' రెడ్డి రత్నాకర్ రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగ పరిశోధక విద్యార్థి సంగు వెంకట్ రెడ్డి, కుంజరాజ్ కుమార్ లు ఆదివారం గుర్తించారు. వివరాల్లోకెళ్తే కిన్నెరసాని నదీ పరివాహక ప్రాంతానికి చెందిన రాకాసి మిట్ట సముద్ర మట్టానికి 253 నుండి 260 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ కొండ ఇసుకరాయితో ఏర్పడింది. ఏటవాలుగా ఉండటంతో పైకి ఎక్కడానికి ఎక్కువ అనుకూలత ఏర్పడింది. ఈ మిట్టకు పక్కన ఉన్న కొండకు మధ్య చిన్న వాగు ప్రవహిస్తుంది. చుట్టూ దట్టమైన అడవి ఉండటంతో ఈ ప్రాంతంలో బృహ శిలాయుగపు మానవులు జీవించడానికి, సమాధులు నిర్మించుకోవడానికి పూర్తిగా అనువైనది కావడంతో ఈ ప్రాంతము భారతదేశంలోనే అత్యంత సుసంపన్నమైన ఐదు ప్రాంతాలలో ఒకటిగా నిలుస్తుందని పరిశోధక బృందం అభిప్రాయ పడింది. భౌగోళికంగా అక్షాంశం 17.8610333 రేఖాంశం 80.637525 ల మధ్య ఉన్నాయి. ఈ సమాధి నిర్మాణాలు బీసీఈ 1200 – 300 మధ్య కాలానికి చెందినవిగా పరిశోధకులు తెలిపారు. ఈ ప్రాంతంలో గుర్తించిన సమాధులు నిర్మాణపరంగా, శిల్పపరంగా ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. సమాధుల చుట్టూ వృత్తాకార రాతి వలయా లు నిర్మించబడ్డాయి. సమాధుల లోపలి భాగంలోకి ప్రవేశించేందుకు మార్గంతో పాటు చతురస్రాకార ద్వారాలను ఏర్పాటు చేశారు. ఈ ద్వారాలకు రాతి పలకలతో మూతలు అమర్చేందుకు వీలుగా ప్రత్యేకమైన నిర్మాణ ఏర్పాట్లు కనిపిస్తున్నాయి. ఒక్కో సమాధిలో రెండు నుంచి నాలుగు రాతి శవపేటికలు ఉండటం విశేషం. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, సమాధుల ఎదురుగా మానవాకృ తిలో చెక్కిన రాతి శిల్పాలను ఏర్పాటు చేశారు. ఈ గుట్ట పైన దాదాపు 100 కి పై గా మానవ ఆకారపు శిల్పాలను పరిశోధక బృందం గుర్తించింది. ఎంత ఎక్కువ సంఖ్యలో ఒక చోట మానవ ఆకృతి శిల్పాలు ఉండటం ప్రాధాన్యత సంతరించుకొన్నది. వీటితో పాటు కొన్ని సమాధుల ముందు వృత్తాకార నీటి తొట్లను కూడా నిర్మించారు. ఈ నిర్మాణాలు అప్పటి ప్రజల అంత్యక్రియల ఆచారాలు, విశ్వాసా లు, సామాజిక జీవన విధానాలపై అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయి.

›› అరుదైన రెండు స్త్రీ మానవాకృత శిల్పాల గుర్తింపు

ఈ పురావస్తు ప్రాంతంలో రెండు అరుదైన స్త్రీ మానవాకృత రాతి శిల్పాలను గుర్తించడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదటి శిల్పం 6 అడుగుల 2 అంగుళాల ఎత్తు, 2 అడుగుల 4 అంగుళాల వెడల్పు, 10 అంగుళాల మందంతో ఉంది. ఈ శిల్పంలో ఛాతీ భాగంలో స్త్రీ వక్షోజాలను పోలిన నిర్మాణం స్పష్టంగా కనిపిస్తోంది. రెండవ శిల్పం 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, 2 అడుగుల 2 అంగుళాల వెడల్పు, 9 అంగుళాల మందంతో ఉంది. ఈ రెండు శిల్పాలు బృహత్ శిలాయుగ సమాజంలో స్త్రీ ప్రతిరూపాలకు ఉన్నప్రాధాన్యతపై పరిశోధనకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా దిగువ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని బృహత్ శిలాయుగ సమాధుల సముదాయాల వద్ద మానవాకృత రాతి శిల్పాలను ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కనిపిస్తాయి. అయితే స్త్రీ మానవాకృత శిల్పాలు లభించడం మాత్రం చాలా అరుదు. గతంలో పడుగోని గూడెం ప్రాంతంలో ఒక స్త్రీ మానవాకృత శిల్పాన్ని పురావస్తు పరిశోధకులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రాకసిమిట్టపై రెండు స్త్రీ మానవాకృత శిల్పాలు లభించడం విశేషమైన పురావస్తు ప్రాధాన్యతను కలిగి ఉంది.

›› త్రిశూలం పెట్రోగ్లిఫ్ నూరుడు గుంటలు.. సూక్ష్మ రాతి పనిముట్లు

రాకసిమిట్ట గుట్టపై ఉన్న బండరాళ్లలో ఒకదానిపై త్రిశూలం ఆకారంలోని పెట్రోగ్లిఫ్ కూడా గుర్తించారు. మరికొన్ని సమాధుల ముందు వృత్తాకార బద్ధి కలిగిన ఆధార రాతిపీఠాలు కనిపిస్తున్నాయి. గుట్టపై అక్కడక్కడ నూరుడు గుంటలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతంలో సూక్ష్మరాతియుగానికి చెందిన రాతి పనిముట్లు కూడా లభించాయి. వీటి ఆధారంగా ఈ ప్రాంతంలో మానవ సంచారం బృహత్ శిలాయుగానికి పూర్వం నుంచే కొనసాగి ఉండవచ్చని పరిశోధక బృందం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా సూక్ష్మరాతి పనిముట్ల ఆధారంగా ఈ ప్రాంతంలో సుమారు క్రీ.పూ. 10,000 సంవత్సరాల నాటికే మానవ ఉనికి ఉండి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

›› సమగ్ర పురావస్తు అధ్యయనానికి ఆవశ్యకత

రాకసిమిట్టపై విస్తారంగా ఉన్న బృహత్ శిలాయుగ సమాధులు, వాటి నిర్మాణ శైలి, రాతి శవపేటికలు, మానవాకృత శిల్పాలు, ముఖ్యంగా అరుదైన స్త్రీ మానవాకృత శిల్పాలు ఈ ప్రాంతాన్ని కీలకమైన పురావస్తు పరిశోధనా స్థలంగా నిలుపుతున్నాయి. ఈ ప్రాంతంపై సమగ్ర పురావస్తు సర్వే, శాస్త్రీయ పరిశోధనలు చేపట్టినట్లయితే అప్పటి ప్రజల అంత్యక్రియల సంప్రదాయాలు, సామాజిక వ్యవస్థ, విశ్వాసాలు, కళా సంప్రదాయాలు, చరిత్రపూర్వ మానవ నివాసాలపై మరింత విలువైన సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాకసిమిట్ట పురావస్తు సంపదను సంరక్షించడంతో పాటు సంబంధిత పురావస్తు శాఖ అధికారులు, విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నూతన ఎసిబి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎసిబి డీఎస్పీ వై రమేష్



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 15, (ప్రజాజ్యోతి) ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ కార్యాలయం ఖమ్మంలోని విడోస్ కాలనీ నుండి పాత మున్సిపాలిటీ ఆఫీసులోకి నూతన కార్యాలయాన్ని ఆదివారం ఏసిబి డిఎస్పీ వై.రమేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీబీ పట్ల ప్రజలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని అనేక అవగాహన ప్రభుత్వ కార్యాలయలో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు అందించాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు, అవినీతి అక్రమాల అరికట్టడంలో ప్రజలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 15 (ప్రజా జ్యోతి) నేడు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరు కావాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెంలోని ఆర్డీవో కార్యాలయం లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం

- వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ



చర్ల, నవంబర్ 15(ప్రజా జ్యోతి): చర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళల కోసం ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భద్రాచలంలోని ఉదయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సాంబ్రాజ్యం ప్రారంభించారు. ఈ శిబిరానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ రేపాక సాత్విక పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పలువురు మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి



ఇల్లందు, నవంబర్ 15 (ప్రజా జ్యోతి) ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కోరారు. ఆదివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇల్లందు మున్సిపల్ అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన దానిని గుర్తించడంతో త్వరలోనే ఇల్లందు మున్సిపాలిటీకి నిధులను మంజూరు చేస్తామని పేర్కొన్నట్లు చైర్ పర్సన్ తెలిపారు. ఇల్లందు మున్సిపాలిటీలో 1,2 వార్డులకు సంబంధించి ముస్లిం మైనారిటీ స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని జిల్లా కలెక్టర్ తో మాట్లాడి రూ. 60 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఇల్లందు మున్సిపాలిటీకి పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడంతో కొంత ఇబ్బంది జరుగుతుందని, వెంటనే రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని పేర్కొన్నారని చైర్ పర్సన్ అన్నారు. ఇల్లందు మున్సిపాలిటీకి ఎలాంటి లోటు లేకుండా చూసే బాధ్యత తనదేనని మంత్రి హామీ ఇచ్చినట్లు చైర్ పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జాఫర్, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు, నాయకులు పరె శ్రీనివాస్, పందిళ్ళ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో మణుగూరు..!

- బీటీపీఎస్ బూడిద, సింగరేణి దుమ్ము, లారీల పొగతో ప్రజల ప్రాణాలకు ముప్పు
- కాలుష్యం తట్టుకోలేక వలసబాట.. మణుగూరు సగం ఖాళీ
- ఊపిరి పీల్చడమే యుద్ధంగా మారింది





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 15 (ప్రజాజ్యోతి) : –

ఒకప్పుడు పచ్చని చెట్లతో, సింగరేణి బొగ్గు గనులతో, కార్మికుల కదలికలతో కళకళలాడిన మణుగూరు నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. గోదావరి ఒడ్డున ఉన్న ఈ ప్రాంతం గతంలో ప్రశాంతమైన జీవనానికి, ఉపాధికి పేరు గాంచింది. నేడు అదే మణుగూరు లో గాలి పీల్చడమే కష్టంగా మారింది. మణుగూరు కాలుష్యానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. ఒకటి బీటీపీఎస్ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే బూడిద, పొగ. రెండు సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల నుంచి ఎగిరే బొగ్గు దుమ్ము. మూడు మణుగూరు మీదుగా రోజూ తిరిగే వందలాది బొగ్గు, ఇసుక లారీలు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు గాలిలో దుమ్ము, బూడిద తేలుతూనే ఉంటుంది. కిటికీలు మూసినా ఇళ్లలోకి దుమ్ము చేరుతోంది. ఆరేసిన బట్టలు నల్లబడుతున్నాయి. పిల్లలు మాస్కు లేకుండా బయటకు రాలేని పరిస్థితి వచ్చింది. గతంలో గర్వంగా చెప్పుకునే "బొగ్గు పట్టణం" నేడు "కాలుష్య పట్టణం" గా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

›» శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు మొదలు

బీటీపీఎస్ నుంచి వచ్చే ఫ్లైయాష్, సింగరేణి నుంచి వచ్చే బొగ్గు దుమ్ము వల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు, దగ్గు, జలుబు పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు తరచూ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సివస్తోంది. పరదాలు కట్టని లారీల నుంచి ఎగిరే దుమ్ము, డీజిల్ పొగ పరిస్థితిని మరింత దిగజార్చుతోంది. కాలుష్యం తీవ్రత పెరగడంతో చాలా కుటుంబాలు మణుగూరును వదిలి వెళ్లిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పిల్లల చదువు, ఆరోగ్యం కోసం ఖమ్మం, కొత్తగూడెం, హైదరాబాద్ వైపు వలస వెళ్తున్నారు. దీంతో ఒకప్పుడు జనంతో నిండిన కాలనీలు నేడు బోసిపోతున్నాయి. ఉదాహరణ : మణుగూరులోని పీవీ కాలనీ కావడం గమనార్హం. కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బొగ్గు లారీలకు కవర్లు తప్పనిసరి చేయడం, రోడ్లపై నీళ్లు చల్లడం, బీటీపీఎస్ బూడిదను శాస్త్రీయంగా నిర్వహించడం వంటి చర్యలు తీసుకోకపోతే మణుగూరు నివాసయోగ్యం కాకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే

- తుమ్మల జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు





చర్ల, నవంబర్ 15(ప్రజా జ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్ల మండలం సుబ్బంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంతో పాటు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. గ్రామానికి చెందిన వర్షం రాంబాబు, సౌమ్రాజ్యం దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకల్లో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి మంత్రి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు






చర్ల, నవంబర్ 15(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను ఆదివారం చర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ రైతు బండారు రామకృష్ణ చేతుల మీదుగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ గత 25 సంపత్సరాలుగా రాష్ట్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సేవలు ఎంతో గొప్పవని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాస రావు, చర్ల పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవికుమార్, మాజీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, బండారు రామకృష్ణ, మేడిచర్ల కుమార్, అలవాల మహేష్ నాయుడు (బాలు), సుందరి సురేష్, తోట మల్ల వరప్రసాద్, చర్ల సొసైటీ డైరెక్టర్ సుందరి పెద్దిరాజు, లింగాపురం ఉపసర్పంచ్ తడికల నరేష్, కాకర్ల కుమార్, ఎస్సీ సెల్ నాయకులు చల్లా పవన్, కణితి శ్రీనివాసరావు, మచ్చ ప్రసాద్, విస్సంపల్లి నాగేశ్వరరావు, మోడెం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులుగా నిలిచిన తాగు నీటి సరఫరా

- మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ
- 23 గ్రామ పంచాయతీలకు నీటి కష్టాలు



చర్ల, నవంబర్ 15(ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని కలివేరు గ్రామం వద్ద మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల ప్రజలు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతిరోజూ సరఫరా అయ్యే మంచినీటిపైనే ఆధారపడుతున్న గ్రామీణ ప్రజలకు రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ప్రజలు తాగునీటి అవసరాల కోసం ఇతర నీటి వనరులపై ఆధారపడుతున్నారు. పైపులైన్ లీకేజీ సమస్యను తక్షణమే గుర్తించి మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 23 గ్రామ పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమస్య పరిష్కారంలో జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని అరికట్టి అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



కోయగూడెం-3, శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను సింగరేణే దక్కించుకోవాలి



ఇల్లందు, నవంబర్ 15 (ప్రజా జ్యోతి) ఈ నెల 17న జరగనున్న బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం అత్యంత సమర్థవంతంగా వ్యవహరించి కోయగూడెం–3, శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి)ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో తాడిచెర్ల, మణుగూరు డిఐపి బ్లాకులను సింగరేణికి కేటాయించిన తరహాలోనే ఈ రెండు బ్లాకులను సంస్థ సొంతం చేసుకునేలా యాజమాన్యం పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. కోయగూడెం–3 బొగ్గు బ్లాక్ లో సుమారు 100 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలతో 30 ఏళ్ల కాలపరిమితి ఉంటుందని, అలాగే శ్రావణపల్లి బ్లాక్ లో 80 మిలియన్ టన్నుల నిల్వలతో పాటు 20 ఏళ్ల కాలపరిమితి ఉందని పేర్కొన్నారు. ఈ రెండు బ్లాకులు సింగరేణి పరివాహక ప్రాంతంలోనే ఉన్నందున సంస్థ భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా వీటిని దక్కించుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఒకవేళ ఈ బ్లాకులు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళితే సింగరేణి భవిష్యత్తు బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం, ఆర్థిక ప్రయోజనాలతో పాటు పర్మినెంట్, బెట్స్పింగ్ కార్మికుల ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సంస్థ దీర్ఘకాలిక మనుగడతో పాటు కార్మికుల ఉద్యోగ భద్రతకు, భవిష్యత్తు తరాల ఉపాధి కల్పనకు భరోసా లభిస్తుందని తెలిపారు. యాజమాన్యం ఈ వేలాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకోని రెండు బ్లాకులు సింగరేణికే దక్కేలా కృషి చేయాలని కోరారు.

రైతు మహాసభలతో పాలకులను మేల్కొలుపుతాం

- భద్రాచలం నుంచి నల్గొండకు కదిలిన వెయ్యి మంది కార్యకర్తలు



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు నల్లగొండలో జరిగే అఖిలభారత రైతు మహాసభలు వేదిక కానున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బి. నర్సారెడ్డి అన్నారు. ఆదివారం జరిగే రైతు గర్జన బహిరంగ సభకు భద్రాచలం నుంచి సుమారు వెయ్యి మంది కార్యకర్తలు తరలివెళ్లారు. అంబేద్కర్ సెంటర్లో వాహనాలను సీనియర్ నాయకుడు బీబీజీ తిలక్తో కలిసి నర్సారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రైతు సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారని ఆరోపించారు.

ప్రెస్క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా బి.వి. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమరౌతు శ్రీనివాస్



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): ప్రెస్క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వి. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సోమరౌతు శ్రీనివాస్, కోశాధికారిగా వై. దుర్గాప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సోములు గిరిప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా దుద్దుకూరి జ్ఞానేందర్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా జె.వి. రత్నం, కే. సత్యనారాయణ, పీఆర్వోగా విజ్జిగిరి రాజా కిరణ్, కార్యవర్గ సభ్యులుగా ఎర్రంశెట్టి కృష్ణ, సోలేటి శ్రీశ్రీ, దిలీప్ కుమార్, రంజిత్ నాయక్, సత్యానంద్, కాటా సత్యం, జి. శ్రీనివాసరావు, చారుగుళ్ల రమేష్, నాయుడు, వెంకట్ ఎన్నికయ్యారు. రానున్న రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించనున్న నూతన కమిటీ పత్రికా విలేకరుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. అక్రిడిటేషన్లు, ఆరోగ్య బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన భద్రత వంటి అంశాలపై సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. ప్రెస్క్లబ్ అభివృద్ధికి, విలేకరుల హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు జె. వెంకట రత్నం పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

జల్, జంగల్, జమీన్ హక్కుల సాధనకు ఆయనే మార్గం

- భగవాన్ బిర్సా ముండా నేటి యువతకు ఆదర్శం
- భద్రాచలంలో ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజా జ్యోతి): భద్రాచలంలో భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, పాత మార్కెట్, ఐటీడీఏ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువకులు బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పూనెం కృష్ణదొర ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి పాయం రవి వర్మ, నాయకులు పటేల్ బెల్లం రమణయ్య, గుండు శరత్, ఈసాల రమణయ్య, జగ్గా పుల్లయ్య, కుంజా ధర్మ, యువ నాయకులు కుంజా సంతోష్, కోర్స రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదివాసి నాయకులు మాట్లాడుతూ... బ్రిటిష్ పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన బిర్సా ముండా పోరాటం చిరస్మరణీయమన్నారు. జల్, జంగల్, జమీన్ హక్కుల సాధనకు ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆదివాసీ ఐక్యతను కాపాడుకుంటూ ఆయన ఆశయాలను భావితరాలకు అందించడమే నిజమైన నివాళి అని అన్నారు.

వనవాసీలో బిర్సా ముండా జయంతి వేడుకలు



చర్ల, నవంబర్ 15 (ప్రజా జ్యోతి): వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసీల ఆరాధ్య దైవం ధర్తీ ఆబా బిర్సా ముండా 151వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వనవాసీ కళ్యాణ పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి షహమీర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షహమీర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం 25 ఏళ్ల వయస్సులోపే తన జాతి ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహా యోధుడు బిర్సా ముండా అని కొనియాడారు. బ్రిటిష్ వారి దోపిడీ, జమీందారుల అణచివేతకు వ్యతిరేకంగా 'అబువా రాజ్ ఏతే జనా మహారాణి రాజ్ టుండు జనా' అంటూ ఉల్గులాన్ ఉద్యమాన్ని ప్రకటించి ఆదివాసీల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. జల్, జంగల్, జమీన్పై ఆదివాసీలకే హక్కు ఉండాలని పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, భాషతో పాటు అడవిపై హక్కులను కాపాడుకోవడమే బిర్సా ముండాకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. విద్యార్థులు విద్యలో రాణించాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలను విడనాడి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత శిక్షణ ప్రముఖ్ మైసర్ల శంకర్, ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం విద్యార్థి నిలయ అధ్యక్షుడు తాటి పాపారావు, సాధం లోకనాధం, బందా స్వరూపరాణి, గోగికార్ రాంలక్ష్మణ్, పోలిన రమాదేవి, బుటారి సుజాత, సంతోష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో నరసింహారావు, సీతాదేవి దంపతులు

- అన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి నాగోల్లోని అరుణోదయ నగర్కు చెందిన నరసింహారావు, సీతాదేవి దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆదివారం భద్రాచలం విచ్చేసిన దంపతులు ముందుగా స్వామివారిని దర్శించుకుని అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులకు అన్నదాన నిమిత్తం విరాళాన్ని అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు అభినందించారు.

భద్రాచలం రెడ్ క్రాస్ శాఖకు రూ.15 లక్షల నిధులు

- గిరిజన చిన్నారులకు హెచ్ పీఎల్ సీ పరీక్షల నిర్వహణకు ఐఓపీ ఆర్థిక సహాయం



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖకు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ కేంద్ర కమిటీ (2026–27) రూ.15 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది. రెడ్ క్రాస్ శాఖ వ్యవస్థాపక సభ్యులు, ప్రముఖ పిల్లల వైద్యులు డా. పిన్నింటి రాజశేఖర్ చేసిన నిరంతర కృషి ఫలితంగా ఈ నిధులు లభించాయి. ఏజెన్సీ ప్రాంతంలోని పేద, గిరిజన చిన్నారులకు సికిల్ సెల్, తలసేమియా వంటి రక్త సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు అవసరమైన హెచ్ పీఎల్ సీ పరీక్షల నిర్వహణకు ఈ నిధులను కేటాయించారు. ఖరీదైన పరీక్షలు చేయించుకోలేని పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడనుంది. వందలాది మంది చిన్నారులకు వ్యాధులను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సలహాలు, చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుంది. హెచ్ పీఎల్ సీ పరీక్ష ద్వారా రక్తంలోని వివిధ రకాల హిమోగ్లోబిన్లను, వాటి శాతాలను విశ్లేషించి తలసేమియా, సికిల్ సెల్ వంటి వ్యాధులను గుర్తించవచ్చు. రక్తహీనత, తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు, తరచూ రక్తం ఎక్కించాల్సిన పరిస్థితులు, కుటుంబంలో ఇటువంటి వ్యాధుల చరిత్ర ఉన్న పిల్లలకు ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఏజెన్సీ ప్రాంత పేద, గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఈ నిధులు రెడ్ క్రాస్ శాఖ సేవలకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయి. నిధుల మంజూరుకు కృషి చేసిన డా. పిన్నింటి రాజశేఖర్ కు, సహకరించిన ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ కేంద్ర కమిటీకి రెడ్ క్రాస్ భద్రాచలం శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత

- పినపాకలో 541 మందికి చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు





పినపాక,నవంబర్ 15 (ప్రజాజ్యోతి) అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 541 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, నేత కార్మికులు తదితర అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ నెల 19వ తేదీన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ కానుందని ఎమ్మెల్యే తెలిపారు.

›» సంక్షేమ పథకాలతో పేదలకు అండ

రాష్ట్రప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

›» మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పథకాల పేరుతో మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంకీర్త్, ఎంపీవో వెంకటేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడా రమేష్, బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోలెం కల్యాణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, దిశా కమిటీ జిల్లా అధ్యక్షుడు మద్దెల సమ్మయ్య, ఉప సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చ నవీన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తుమ్మల జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 15, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. డీసీసీ జనరల్ సెక్రటరీ వనమా గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- పేదవాడికి అండగా ప్రజా ప్రభుత్వం : కాంగ్రెస్ నాయకులు ఆరె నవీన్
- సీతంపేట పంచాయతీలో 19 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల అందజేత



పినపాక,నవంబర్ 15 (ప్రజాజ్యోతి) ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరె నవీన్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీతంపేట సర్పంచ్ పోతినేని శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం పినపాక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మండలవ్యాప్తంగా 541 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఇందులో సీతంపేట గ్రామపంచాయతీ పరిధిలో 19 మంది వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్ల మంజూరు పత్రాలు అందించినట్లు సర్పంచ్ పోతినేని శివశంకర్, కాంగ్రెస్ నాయకులు ఆరె నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆరె నవీన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సర్పంచ్ పోతినేని శివశంకర్ మాట్లాడుతూ.. నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని అన్నారు. సీతంపేట పంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషిచేస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించడమే తమ ధ్యేయమని వారు స్పష్టం చేశారు.

వికలాంగుల పింఛన్ మంజూరు కాక మనస్తాపం

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చర్ల, నవంబర్ 15: (ప్రజా జ్యోతి): వికలాంగుల పింఛన్ మంజూరు కాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వికలాంగుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చర్ల మండలంలోని సింగసముద్రం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. సింగ సముద్రం గ్రామానికి చెందిన అంగడి రాజు (40) వికలాంగుడు. ఆయనకు భార్య స్వరూప ఉన్నారు. గతంలో పలుమార్లు వికలాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పింఛన్ మంజూరు కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పింఛన్‌కు సంబంధించి వికలాంగత్వ శాతం తగ్గించడంతో అర్హత ఉన్నప్పటికీ పింఛన్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చర్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) తరలించారు. అక్కడ వైద్యులు డాక్టర్ సంకీర్త్ ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ వికలాంగుడైన రాజు పలుమార్లు వికలాంగ పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరు కాకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రాజుకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయడంతో పాటు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి



భద్రాచలం, నవంబర్ 15 (ప్రజాజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం (నవంబర్ 16) నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. ఆదివారం ఓ సంయుక్త ప్రకటనలో వారు పేర్కొన్నారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వక ఫిర్యాదులు అందజేయాలని కోరారు. సంబంధిత ఐటీడీఏ యూనిట్, డివిజన్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఆయా కార్యాలయాల సమావేశ మందిరాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

రక్తదాన సేవకు రాష్ట్రస్థాయి గుర్తింపు!

- వినోద్ కుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం!



చుంచుపల్లి,నవంబర్ 15, (ప్రజాజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందిస్తూ, ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న వారికి అండగా నిలుస్తున్న సామాజిక సేవకుడు వినోద్ కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విజయ్ బ్లడ్ ఫౌండేషన్ ద్వారా రక్తదాన సేవలను విస్తృతంగా అందిస్తున్న ఆయనకు 2026 సంవత్సరానికిగాను ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అఖిలభారత ఎన్జీవో హెల్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కేబీఆర్ ఫౌండేషన్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో నిర్వహించిన సమాజ సేవకుల ఆత్మీయ సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. సమాజానికి విశేష సేవలు అందిస్తున్న సేవకులను గుర్తించి సత్కరించే కార్యక్రమంలో వినోద్ కుమార్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన బాధితులకు రక్తదాతలను సమన్వయం చేస్తూ, సకాలంలో రక్తం అందేలా విజయ్ బ్లడ్ ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న కృషి అభినందనీయం. రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదనే సంకల్పంతో మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ మరింత మందికి రక్తదాన సేవలు అందిస్తూ సమాజ సేవలో ముందుకు సాగుతానని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆయనకు పురస్కారం లభించడం పట్ల స్థానికులు, రక్తదాతలు, పలువురు సామాజిక సేవకులు అభినందనలు తెలియజేస్తున్నారు. మానవత్వమే లక్ష్యంగా సాగుతున్న వినోద్ కుమార్ సేవా ప్రయాణానికి ఈ పురస్కారం మరింత స్ఫూర్తినిస్తోంది.

అశ్వారావుపేట నుంచి నల్గొండకు కిసాన్ సభ శ్రేణుల భారీ కదలిక!

డప్పు మేళాలు.. ఎర్రజెండాల రెపరెపలు.. నినాదాల హోరు మధ్య 36వ జాతీయ మహాసభలకు బయలుదేరిన రైతు సంఘం ప్రతినిధులు!

అశ్వారావుపేట రూరల్ ప్రజా జ్యోతి: అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల నేపథ్యంలో అశ్వారావుపేట నుంచి రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నల్గొండకు బయలుదేరారు. డప్పు మేళాల మోతలు, ఎర్రజెండాల ప్రదర్శన, ఉత్సాహభరిత నినాదాల మధ్య వారి ప్రయాణం ప్రారంభమైంది. రైతాంగ సమస్యలు, రైతుల హక్కులు, వ్యవసాయ రంగ సవాళ్లపై చర్చించనున్న 36వ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు అశ్వారావుపేట ప్రాంతం నుంచి ప్రతినిధులు తరలివెళ్లారు. డప్పు మేళాలతో సాగిన ఈ బయలుదేరే కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

